## రైతులకు సరిపడా యూరియా అందించాలి : ముత్యాల విశ్వనాథం




పాల్వంచ, జూన్ 23 (తెలంగాణ వాణి)

రైతులకు సరిపడా యూరియా కట్టలు అందించడంతో పాటు యూరియా యాప్‌ను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం భద్రాద్రి జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సీఆర్భవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీని షరతులు లేకుండా అమలు చేయాలని, పెంచిన ఎరువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి బోనస్ ఇవ్వాలని కోరారు. రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకుని రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : చిలుకూరి రమేష్




కొత్తగూడెం, జూన్ 23 (తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన వ్యవసాయ ప్రణాళిక ప్రకటించాలని కోరారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని, యూరియా యాప్‌ను రద్దు చేసి నేరుగా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పంటల బీమా పథకాన్ని అమలు చేసి, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, గొట్టిపూళ్ళ దుర్గా శ్రీనివాసు, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ పైడిపల్లి రవీందర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, లక్ష్మీదేవి మండల అధ్యక్షుడు నవీన్, తెల్లం నరసింహారావు, నిమ్మటూరి రామారావు, బానోత్ కుమార్, గడ్డం అజయ్ కుమార్, భూక్య మోహన్, బిజెపి కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ మహాసభ నిర్వహణ

కొత్తగూడెం, జూన్ 23 (తెలంగాణ వాణి)

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ మహాసభ సోమవారం కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ మహాసభలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్. సీతా మహాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ( ఎస్ ఐ ఆర్ ) పేరుతో అంగన్వాడీ టీచర్లకు బీఎల్ఓ విధులు అప్పగించడం వల్ల అంగన్వాడీ కేంద్రాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలు మూతపడటంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పోషకాహారం, సేవలు నిలిచిపోతున్నాయని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లపై అదనపు పనిభారం మోపకుండా బీఎల్ఓ విధులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18,000 కనీస వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన




కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు గోనే మణి మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ మహాసభలో జిల్లా నాయకులు నేరళ్ల రమేష్, జక్కుల రాములు, కృష్ణవేణి, కమల, సరోజ, జానకి, కృపమ్మ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. విడుదల చేసినవారు.

## యువత ఉద్యమాలకు వెన్నెముక కావాలి

**- డా. మైపతి అరుణ్ కుమార్**



చర్ల, జూన్ 22 (తెలంగాణ వాణి)

ఆదివాసీ నాయకుడు వాసం ముసలయ్య ఆధ్వర్యంలో పలువురు యువకులు తుడుందెబ్బలో చేరారు. ఆదివారం నిర్వహించిన సభ అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంస్థలో చేరికయ్యారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, భవిష్యత్ ఉద్యమాలు విజయవంతం కావాలంటే యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు, లంబాడీలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో యువకులు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి గూడెంలో తుడుందెబ్బ విస్తరించి ఉద్యమ స్ఫూర్తి ప్రతి ఇంటికి చేరాలని కోరారు. సభను విజయవంతం చేసిన ఆదివాసీ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తుడుందెబ్బ సీనియర్ నాయకుడు వాసం ముసలయ్యను రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమించగా, ఆదివాసీ యువ నాయకుడు పూనెం వరప్రసాద్‌ను భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, ఆదివాసీ సీనియర్ నాయకులు కుర్సం రాంబాబు, తుడుందెబ్బ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ధరబోయిన రమేష్, మహిళా రాష్ట్ర నాయకురాలు వట్టం సుభద్ర, సీనియర్ నాయకుడు తాటి రామకృష్ణతో పాటు శ్యామల తరుణ్, పూనెం రవికిరణ్, కలం శ్రీనివాస్, కోరం భిక్షపతి, ఇర్ప అరుణ్ కుమార్, ఇర్ప అరుణ్ తేజ్, ఇర్ప సాయికిరణ్, కోరం వేణు, మడప అనిల్ పాల్గొన్నారు.

## కార్మిక చైతన్యానికి శిక్షణా తరగతులు దోహదపడాలి ఎమ్మెల్యే కూనంనేని





కొత్తగూడెం, జూన్ 23 (తెలంగాణ వాణి)

ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులు కార్మిక చైతన్యానికి దోహదపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం గౌతంపూర్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా కార్మిక హక్కులు నిర్వీర్యమవుతున్నాయని, వాటి పరిరక్షణకు ఉద్యమాలే శరణ్యమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ నుంచి కాపాడేందుకు సమిష్టి పోరాటాలు అవసరమన్నారు. యూనియన్ ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో కార్మికులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్మిక సంక్షేమం, కార్మికవాడల అభివృద్ధి కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కులంవర్గం వర్గపోరాటాలుసామాజిక న్యాయం, అంశంపై సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడారు. కార్మికవర్గం ఎదుర్కొంటున్న సవాళ్లుపై యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ప్రసంగించగా, చారిత్రిక భౌతికవాదం అంశాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగ్ నర్సింహా రావు వివరించారు. అనంతరం వి.మల్లికార్జునరావు లేబర్ కోడ్లపై ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరస్వామి, రమణమూర్తి, సముద్రాల సుధాకర్, క్రిస్టోఫర్, గట్టయ్య, సూర్య ప్రకాష్, సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలల్, గుమ్మడి వీరయ్య, భూక్యా రమేష్, ఏం ఆర్ కే ప్రసాద్, మధుకృష్ణ, కమల్, కిషోర్, చారి, భీమయ్య, అప్పారావు, బండారి మల్లయ్య, రాజేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.



## పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్ట్

**- ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినట్టు**

**తెలిపిన సీపీ గౌస్ ఆలం**

కరీంనగర్:జూన్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)

స్థానిక పీఎంజే జ్యువెలరీ షోరూంలో మే 3న జరిగిన సంచలన సాయుధ దోపిడీ కేసులో కరీంనగర్ పోలీసులు మరో కీలక పురోగతి సాధించా రు. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేయడం తో పాటు,వారి నుంచి కీలకమైన ఆధారాలు,ఆయు ధాలను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) తెలిపారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్ట్ అయిన నిందితు ల సంఖ్య 8 కి చేరింది. రేపటితో ముగియనున్న ఐదుగురి కస్టడీ ఈ నెల 17వ తేదీన కోర్టు అనుమతితో ఆరు రోజుల పోలీస్ కస్టడీ లోకి తీసుకున్న ఐదుగురు ముఖ్య నిందితుల (1 సుబోధ్ సింగ్,2 రఘునాథ్, 3 రావిష్,10 అమర్ సింగ్, 11జైనుల్లాబ్దీన్) కస్టడీ రేపటితో ముగియనుంది. కస్టడీ విచారణలో భాగంగా నిందితుడు రఘునాథ్ ఇచ్చిన సమాచారం మేరకు నేరానికి ఉపయోగించిన టీవీఎస్ అపాచీబైక్‌ను మహారాష్ట్ర లోని బల్లార్షా రైల్వే స్టేషన్ సమీపం నుండి పోలీసులుస్వాధీనంచేసుకు న్నారు.

**కరీంనగర్ శివారులో ఏడో నిందితుడి అరెస్ట్ పిస్టల్ స్వాధీనం**

షోరూంలో కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన ఐదుగు రిలో ఇప్పటికే ఇద్దరు అరెస్ట్ కాగా,తాజాగా మూడో వ్యక్తి అయిన సూర్యమణి సనోజ్ కుమార్ (21) ను కరీంనగర్ శివారులో పోలీ సులు అదుపులోకి తీసుకు న్నారు. నిందితుడిని విచా రించగా వచ్చిన సమాచారం ఆధారంగా రామడుగు మండల శివారులోని ఎస్ఆర్ఎస్పి కెనాల్ వద్ద గల తాత్కాలిక నిర్మాణ షెడ్ల సమీపంలో కీలక ఆధారాలు సేకరించారు. నేరం జరిగిన రోజు నిందితులు ధరించిన 5 జతల దుస్తులు,3 జతల బూట్లు. మూడు నకిలీ టూ వీలర్ ఆర్‌సి కార్డులు,రెడ్ మి మొబైల్ ఫోన్ స్వాధీనం. అక్కడే దాచి ఉంచిన ఒక పిస్టల్,ఒక మ్యాగజైన్ ను పోలీసులు స్వాధీనం చేసు కున్నారు.




**బీహార్‌లో ఎనిమిదో నిందితుడి అరెస్ట్ ట్రాన్సిట్ వారెంట్**

ఈ కేసుతో సంబంధం ఉన్న మరో కీలక నిందితుడు ఎం.డి.ఆదిల్ ఖాన్ ను బీహార్ రాష్ట్రం, పాట్నాలోని పుల్వారి షరీఫ్ వద్ద కరీంనగర్ ప్రత్యేక పోలీస్ బృందం అరెస్ట్ చేసింది. ఇతడిని తెలంగాణకు తరలిం చేందుకు స్థానిక కోర్టులో ట్రాన్సిట్ వారెంట్ దాఖలు చేసినట్లు సీపీ తెలిపారు. గతంలో అరెస్ట్ అయిన క్రెటా కార్ డ్రైవర్ జైనులబ్దీన్‌కు నేరానికి సహకరించేందుకు ఈ ఆదిల్ ఖానే క్రెటా కారును,నిందితు లకు తుపాకులను సరఫరా చేసినట్లు విచారణలో తేలిందని అన్నారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టా త్మకంగా తీసుకుని,నిందితు లను చాకచక్యంగా పట్టుకున్న కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ,టౌన్ ఏసీపీ వెంకటస్వామి,ఇన్స్పెక్టర్లు సృజన్ రెడ్డి, బొల్లం రమేష్, బగ్గని శ్రీనివాస్,తిరుమల్, ప్రకాష్,ఎస్సై శేఖర్ మరియు ఇతర పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ అభినందిం చారు.

## పబ్లిక్ స్కూల్ తరలింపును వ్యతిరేకిస్తూ మూడు గ్రామాల ప్రజల ఆందోళన.!

హనుమకొండ/ఆత్మకూరు:(తెలంగాణ వాణి ప్రతినిధి)జూన్ 22

ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను పెద్దాపురం గ్రామానికి తరలించే ప్రతిపాదనపై స్థానికంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ నీరుకుళ్ల, పెంచికలపేట కేశవాపూర్ గ్రామాల ప్రజలు సోమవారం హనుమకొండ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు కీలక విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీరుకుళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల ప్రకారం, సర్వే నంబర్-5లో 4 ఎకరాల 7 గుంటల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ ఆ భూమిలో కొంత భాగం అన్యాక్రాంతమై ఉంటే, దానిని తిరిగి స్వాధీనం చేసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అంతేకాదు, అదనంగా భూమి అవసరమైతే గ్రామ ప్రజలుగా తాము సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భూమి కొరత ఉందని తమకు ఎలాంటి లిఖితపూర్వక సమాచారం ఇవ్వలేదని, భూమిని సమకూర్చుకునేందుకు అవకాశం కూడా కల్పించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోకుండా, సహజ




న్యాయ సూత్రాలకు విరుద్ధంగా టీపీఎస్‌ను మరో గ్రామానికి తరలించే నిర్ణయం తీసుకోవడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీపీఎస్‌ను నీరుకుళ్ల గ్రామంలోనే ఏర్పాటు చేయాలని, ఒకవేళ నీరుకుళ్లను అనర్హంగా పరిగణించినట్లయితే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్‌ని కోరారు. తుది నిర్ణయం తీసుకునే ముందు మూడు గ్రామాల ప్రజల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.